జాతీయ సదస్సుకు వ్యాసాల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 27: బెంగళూరు విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 20, 21 తేదీలలో తెలుగు కన్నడ జానపద-గిరిజన సాహిత్యం-తులనాత్మకత అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు సంచాలకులు ఆచార్య కె.ఆశాజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో భాగంగా ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీవేత్తలు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్స విద్యార్థులను స్వాగతిస్తూ, వ్యాసాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 15లోగా తమ పేర్లను నమోదు చేసుకొని వ్యాసాలను కూడా పంపించాలన్నారు. వివరాలకు 9449672394 నంబర్‌లో సంప్రదించాలని, ఆసక్తి కలిగిన వారికి గూగుల్ లింకును పంపిస్తామని వెల్లడించారు.

నేటి నుంచి వైఎంసీఏలో జిల్లా జూనియర్ కాలేజ్ పోటీలు

కాచిగూడ, సెప్టెంబర్ 27: హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ (హెచ్.డీ.జీ.సీ.జీ.ఎఫ్)ఆధ్వర్యంలో నేటి నుంచి నారాయణగూడ వైఎంసీఏ టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.జక్కయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నీలో అండర్- 19 సంవత్సరాల బాలబాలికలు పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.వివరాలకు 7032057633లో సంప్రదించాలని కోరారు.

30న విశ్వహిందూ పరిషత్ శాంతియుత నిరసన

కాచిగూడ,సెప్టెంబర్ 27: ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన తిరుపతి లడ్డూ అపవిత్రమైన ఘటన కోట్లాది మంది హిందూ మనోభావాలను గాయపరించదని తెలంగాణ విశ్వహిందూ పరిషత్ ఆందోళన వ్యక్తం చేసింది.దానిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి లడ్డూ తయారీ బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.ఈ మేరకు ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా విశ్వహిందూ పరిషత్ శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పగుడాకుల బాలస్వామి పాల్గొన్నారు.

దసరాను ఘనంగా నిర్వహించాలి

మెహిదీపట్నం, సెప్టెంబర్ 27: కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లో నిర్వహించే దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సంగం రామమందిరం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబా అన్నారు.శుక్రవారం సాయంత్రం లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు బోగి బాల్‌రాజ్,కార్యదర్శి అనిల్ గౌతం,కోశాధికారి శ్రీనివాస్‌లు సంగం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబాను కలిసి దసరా ఉత్సవాల కోసం చేస్తున్న ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రాణాలైనా తీసుకుంటాం కానీ..

- ఇండ్లను కూల్చనివ్వమంటూ నినాదాలు
- అంబర్ పేట మూసీ పరీవాహక ప్రాంతాల్లో అధికారుల సర్వే
- ఇండ్లు కూల్చొద్దంటూ మూసీ ప్రాంత నివాసితుల ఆందోళన
- నిరసనల మధ్య దుర్గానగర్‌లో మార్కింగ్
- తీవ్ర ఉద్రిక్తత నేపథ్యంలో వెనుదిరిగిన అధికారులు

కార్వాన్‌లోని దరియా బాగ్‌లో మూసీని ఆనుకొని ఉన్న ఇండ్లను సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డుకొని నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

అంబర్ పేట/ గోల్నాక, సెప్టెంబర్ 27 : మూసీ సుందరీకరణలో భాగంగా అంబర్‌పేటలోని మూసీ పరీవాహక ప్రాంతాలైన అంబర్‌పేట డివిజన్ దుర్గానగర్, గోల్నాక డివిజన్‌లోని న్యూ తులసీరాంనగర్ లంక, కమలానగర్, అన్నపూర్ణనగర్, అంబేద్కర్‌నగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం సర్వే నిర్వహించడానికి వచ్చిన అధికారులకు మూసీ ప్రాంత నివాసుల నుంచి నిరసన సెగ తగిలింది. అంబర్‌పేట డివిజన్ దుర్గానగర్‌లో సర్వే చేస్తోన్న అధికారులను సర్వే చేయొద్దంటూ మూసీ నివాసితులు పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. దీంతో అధికారులు పూర్తి స్థాయిలో సర్వే చేయకుండానే వెనుదిరిగిన పరిస్థితి ఏర్పడింది. అంతే కాకుండా మూసీ పరీవాహక ప్రాంత వాసులు ఆందోళనలో భాగంగా హైడ్రాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. 'సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్' 'గో బ్యాక్ హైడ్రా' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో అక్కడి నుంచి అధికారులు వెనుదిరిగారు. తమ ప్రాణాలైన తీసుకుంటాం కాని ఇక్కడ ఇండ్లను కూల్చనీయమంటూ పలువురు మూసీ నివాసితులు భీష్మించారు. మూసీని సుందరీకరిస్తే గోడకట్టుకొని పనులు చేసుకోమ్మను..కానీ మా ఇండ్ల దగ్గరకు రావొద్దంటూ ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు.

కార్వాన్‌లో అడ్డుకున్న స్థానికులు

కార్వాన్/మెహిదీపట్నం: హైడ్రా పేరుతో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కూల్చివేతల పర్వం కొనసాగుతుంది. కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్ డివిజన్ దరియా బాగ్, కేసరీ హనుమాన్ ఆలయ సమీపంలోని మూసీ పరీవాహక ప్రాంతంలో శుక్రవారం ఆసిఫ్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు ఇండ్లకు సర్వే చేసి మార్కింగ్ వేసేందుకు వచ్చారు. శుక్రవారం రెవెన్యూ అధికారులు రావడంతో స్థానికులంతా ఒక్కసారిగా రోడ్ల పైకి వచ్చి అధికారులు సర్వే చేయకుండా రోడ్డు పైనే అడ్డుకున్నారు.

కార్వాన్ మూసీ ప్రాంతంలో 127 ఇండ్లను గుర్తించాం

కార్వాన్‌లోని మూసీ ప్రాంతంలో 127 ఇండ్లను గుర్తించాం. అయితే తాము ప్రస్తుతం మూసీ రివర్ బెడ్‌లోని ఇండ్లను మాత్రమే గుర్తిస్తున్నామని ఆ ఇండ్లకే గుర్తులు వేసేందుకు వచ్చాము. తాము కేవలం ఒక ఇంటికి మాత్రమే గుర్తు వేశాము. ఇతర ఇండ్ల వైపు తమను వెళ్లకుండా అడ్డుకోవడంతో వెనుదిరిగాము. కాగా మళ్ళీ అధికారులు సర్వే కోసం వస్తారా అన్న ప్రశ్నకు తానేమి చెప్పలేనని తహసీల్దార్ చెప్పారు.

జ్యోతి, తహసీల్దార్, ఆసిఫ్‌నగర్

నిరసన తెలియజేస్తున్న కమలానగర్ వాసులు, పట్టా ల్యాండ్ పట్టాలు చూపిస్తున్న మహిళలు

అక్కినేని పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి: ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని పురస్కార మహోత్సవం రవీంద్రభారతిలో స్వర సామ్రాట్ డా.టి.శరత్‌చంద్ర స్వర సారథ్యంలో డాక్టర్ అక్కినేని పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం, మధుర సంగీత విభావరి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త అడుసుమల్లి జగదీశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్వరసామ్రాట్ డా.టి. శరత్‌చంద్ర,ఘంటసాల ఆర్ట్స్ అకాడఅమీ అధ్యక్షుడు పాణకాల నాగేశ్వరరావులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి అక్కినేని చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం పలువురి కళాకారులకు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాలను ప్రదానం చేశారు.

పురస్కార గ్రహీతలతో డా.శరత్‌చంద్ర, నాగేశ్వరరావు

పేదల ఇండ్లు కూల్చొద్దు



అంబర్‌పేట మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తోన్న అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్

గోల్నాక, సెప్టెంబర్ 27 : అంబర్ పేట డివిజన్ మూసీ పరీవాహక ప్రాంతాల్లోని మూసారాంబాగ్ అలీకేఫ్ చౌరస్తా సమీపంలోని పేదల ఇండ్లను కూల్చొద్దని అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం అక్కడి నివాసితులతో కలిసి అంబర్ పేట మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లవంగు ఆంజనేయులు, లింగారావు, జాఫర్, సీపీఎం నాయకుడు మహేందర్ తదితరులు ఉన్నారు.

పేదల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదు



తులసీరాంనగర్ లంకలో వివరాలు తెలుసుకుంటున్న డా.ఎన్.గౌతంరావు

అంబర్‌పేట, సెప్టెంబర్ 27: పేదల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డి.ఎన్.గౌతంరావు అన్నారు. గోల్నాక డివిజన్‌లో రోజుకో మాట చెప్తూ అక్కడ నివసిస్తున్న ప్రజలను మార్కింగ్‌ల పేరుతో బెదిరిస్తూ భయం గుప్పిట్లో బతికేలా చేస్తున్నారన్నారు. శుక్రవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్‌తో కలిసి గౌతంరావు డివిజన్‌లోని కమలానగర్, తులసీరాంనగర్, న్యూతులసీరాంనగర్(లంక) ప్రాంతాలలో పర్యటించి అక్కడి ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేసరి నరసింహయాదవ్, ఆర్కే రాంచందర్, దామోదర్‌నాయుడు, కే.రవీందర్, ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడలు

బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్లు, ఉమ, మహాలక్ష్మి, డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి

కాచిగూడ,సెప్టెంబర్ 27: విద్యార్థులు విద్యతో పాటు వివిధ క్రీడల్లో రాణించినప్పుడే చదువుకు సార్థకత ఏర్పడుతుందని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు.హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ ఈఓ ఎం.విజయలక్ష్మి ఆధ్వర్యంలో 68వ హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఇంటర్ హిమాయత్‌నగర్ జోనల్ లెవల్ స్కూల్ కబడ్డీ,ఖోఖో పోటీలు కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారంతో ముగిశాయి. కబడ్డీ,ఖోఖో పోటీల్లో హిమాయత్‌నగర్‌లోని న్యూ చైతన్య హైస్కూల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. ముఖ్యఅతిథులుగా కాచిగూడ, హిమాయత్ నగర్ కార్పొరేటర్లు ఉమా, మహాలక్ష్మి హాజరై మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, వాటిని యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి,పీఈటీ లక్ష్మణ్‌నాయక్, వి.ప్రసాద్‌రావు, డాక్టర్ లక్ష్మయ్య గంగపుత్ర, నిజామోద్దిన్,కృష్ణకుమార్, సుభాష్‌పటేల్, క్షీర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సూపరింటెండెంట్లుగా బాధ్యతలు స్వీకరణ

సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జాలెం అనురాధ

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 27: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జాలెం అనురాధ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ మేరకు రాష్ట్ర హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ ఛోంగ్తు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలను చేపట్టారు. కాగా డాక్టర్ అనురాధ 1982లో ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, ఎండీని పూర్తి చేశారు. కాగా గురువారం రాష్ట్ర హెల్త్ సెక్రటరీ దవాఖానలకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ల నియామకంలో సుల్తాన్ బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమించడంతో పదవీ బాధ్యతలను చేపట్టారు. అనంతరం దవాఖాన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, మినిస్ట్రీరియల్ స్టాఫ్,శానిటేషన్,సెక్యూరిటీ సిబ్బంది ఆమెను శాలువాలతో సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

ఉస్మానియా దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాఖేష్ సహాయ్

ఉస్మానియా దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాఖేష్ సహాయ్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డాక్టర్ రాఖేష్ సహాయ్‌ను ఆర్ఎంవో-1 డాక్టర్ జయకృష్ణ,ఆర్ఎంవోలు డాక్టర్ రఫీ, డాక్టర్ సిద్దిఖీ,డాక్టర్ కవిత,డాక్టర్ విజయ్‌భాస్కర్‌తో పాటు వైద్యులు,పలు విభాగాల హెచ్‌వోడీలు,నర్సులు,వైద్య సిబ్బంది తదితరులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. - సుల్తాన్‌బజార్

ప్రభుత్వ ఈఎన్టీ దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆనంద్ ఆచార్య

కోఠిలోని ప్రభుత్వ ఈఎన్టీ దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆనంద్ ఆచార్య శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆనంద్ ఆచార్యను టీఎన్జీవో యూనిట్ అధ్యక్షులు తూముకుంట రాజు,ఆఫీస్ సబార్డినేట్ సునీల్,రవి,సంతోష్ తివారి,అశ్విన్,భాస్కర్,అజ్మత్ అలీలు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. - సుల్తాన్‌బజార్

క్రీడల్లో ప్రతిభ చాటిన నారాయణ స్కూల్ విద్యార్థులు

ట్రోఫీని అందజేస్తున్న డిప్యూటీ ఈవో విజయలక్ష్మి

అంబర్‌పేట, సెప్టెంబర్ 27: హిమాయత్‌నగర్ జోన్ 68వ పాఠశాల క్రీడల పోటీల్లో డీడీ కాలనీ నారాయణ స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. అండర్-14 కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను డిప్యూటీ ఈవో విజయలక్ష్మి అభినందించారు. ఇలాంటి క్రీడల పోటీలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు ట్రోఫీని అందజేశారు.

ఆహ్వాన బ్రోచర్ ఆవిష్కరణ

అక్టోబర్ 3 నుంచి నాంపల్లిలోని నుమాయిష్ మైదానంలో నిర్వహించనున్న 52వ రామయణ మేళా బ్రోచర్‌ను గోవింద్ రాఠి, కమల్ నారాయణ్ అగర్వాల్, గిర్ధారీ లాల్ దాగా, మనోజ్ జైస్వాల్ తదితరులు కలిసి విడుదల చేశారు. - అబిడ్స్

పనులు త్వరగా చేపట్టండి:

కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా.రోహిన్‌రెడ్డి శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిశారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో చేపట్టవల్సిన అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేశారు. పనులు తొందరగా చేపట్టాలని కోరారు. -అంబర్‌పేట

సమస్యలు పరిష్కరించండి

అబిడ్స్, సెప్టెంబర్27: గోషామహల్ నియోజకవర్గంలోని జాంబాగ్, గోషామహల్ డివిజన్‌లలో సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు .ఈ విషయమై ఆయన శుక్రవారం పలు ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి పాదయాత్ర చేసి స్థానిక సమస్యలు తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు.

గ్రేటర్ కార్పొరేటర్ల స్టడీ టూర్లో భాగంగా అస్సాం సీఎం హేమంత విశ్వశర్మను కలిసి సన్మానిస్తున్న గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్ తదితరులు

కొండాలక్ష్మణ్..నేటి తరానికి ఆదర్శం

టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ

అంబర్‌పేట, సెప్టెంబర్ 27: ప్రముఖ స్వాంతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర అందరికి స్ఫూర్తిదాయకమని అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం నాయకులు పలువురు పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యలో శివం రోడ్డులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు పర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలక శివ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది ఊపిరి ఉన్నంత వరకు కొట్లాడిన మహోన్నత వ్యక్తి బాపూజీ అన్నారు. ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, గంగిశెట్టి సత్తయ్య, కుండెన సత్యనారాయణ, కార్యదర్శులు గందమల్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి వనం రమణ, సభ్యులు ఆవుల రాములు, నాగుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ స్ఫూర్తితో..

తెలుగు యూనివర్సిటీ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలిదశ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్న పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని సింగరేణి జనరల్ మేనేజర్ కో ఆర్డినేషన్ ఎస్.డి.ఎం సుభాని అన్నారు. సింగరేణి భవన్‌లో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవి ప్రసాద్, అడిషనల్ జనరల్ అకౌంట్స్ చక్రవర్తి, చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథరాజు, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ కోసం మంత్రి పదవి త్యాగం

సుల్తాన్‌బజార్: క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటీష్ వారిని ఎదిరించడంతో పాటు అదే స్ఫూర్తితో నిజాంను ఎదిరించిన మహనీయుడు స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ కొనియాడారు.ఈ మేరకు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకొని నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షులు కేఆర్ రాజ్‌కుమార్,ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్, సభ్యులు ముఖీం ఖురేషి,ఏపీఆర్‌వో ఎండీ వహీద్,మహ్మద్ ముస్తఫా, ఉస్మాన్ అలీ ఉస్మాని,రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

నివాళులర్పిస్తున్న నాంపల్లి నియోజకవర్గం నాయకులు చెన్నబత్తిని లక్ష్మీనారాయణ,సంజయ్‌లు

ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సింగరేణి అధికారులు, ఉద్యోగులు

సేవాభావం,క్రమశిక్షణతో విజయం సాధించాలి

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 27: ప్రతి విద్యార్థి సేవాభావం,క్రమశిక్షణతో విజయం సాధించే దిశగా కృషి చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ రాములు అన్నారు.ఈ మేరకు శుక్రవారం బొగ్గులకుంట హనుమాన్ టెక్డీలోని ప్రగతి మహా విద్యాలయ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఎన్ ఎస్ఎస్ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు.క్రమశిక్షణకు మారుపేరైన ఎస్ఎస్ఎస్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నేషనల్ అవార్డు గ్రహీత దేవర మనోజ్ ఖన్నా,హెచ్ వోడి అమిత్ సింగ్, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ రాములును సన్మానిస్తున్న దృశ్యం

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో.. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు

జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టడీ టూర్‌లో భాగంగా గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు పలువురు కార్పొరేటర్లు లక్నో, ఇండోర్ మున్సిపాలిటీలను సందర్శించారు. ఈ సందర్భంగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కలిసి సన్మానించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ 40 నిమిషాలు సమయం కేటాయించి కార్పొరేటర్లతో చర్చించారు. ఓకల్ ఫర్ లోకల్ పేరుతో స్థానికంగా యూపీలోని పలు జిల్లాలలో తయారుచేయబడిన వస్తువులను కార్పొరేటర్లకు రిటర్న్ గిఫ్ట్‌గా అందించినట్లు తెలిపారు. -అబిడ్స్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,సెప్టెంబర్ 27: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు.కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి(50)శుక్రవారం మలక్‌పేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-2లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి వివరాల కోసం 8712568495లో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

మైత్రీ,పీస్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

మెహిదీపట్నం సెప్టెంబర్ 27: పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు.శుక్రవారం గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మైత్రీ,పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ మాట్లాడుతూ ప్రజలు దసరా,మిలాద్ ఉన్ నబీ జల్సా కార్యక్రమాలను సంయమనంతో జరుపుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేనందున ప్రతి ఒక్కరూ ఈ నియమాన్ని పాటించాలన్నారు.

తెలంగాణలో టూరిజం అభివృద్ధి చెందాలి

రవీంద్రభారతి,సెప్టెంబర్ 27: తాను టూరిజం చైర్మన్‌గా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో టూరిజం ఎంతో అభివృద్ధి చెందిందని, రాబోయే కాలంలో టూరిజ మరింత అభివృద్ధి చెందాలన్ని టీ.పీసీసీ ప్రచార కమిటీ కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. పినాకిని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పలువురికి బెస్ట్ టూరిజం అవార్డులను ఉప్పల శ్రీనివాస్ గుప్త బహూకరించారు.